



కోర్కెలు ఎందుక్కలగాలి అంటే ఏం చెబుతాం? అవి కలుగుతాయి. అది వాటి లక్షణం. రావుకి ఆవేళ అర్జంటుగా... ఆఫీసుకి వెళ్తున్నప్పుడు ఆ సాయంకాలం సురేఖను తీసుకుని షికారుకి వెడదామనిపించింది. 'అదో! వక్కపొడి డబ్బీలో వుంది. వేసుకు మరీ వెళ్లండి! ఇవాళ ఆకుల్లేవు' అని భార్య వేసిన కేకకు మారుగా-

'అది సరేగాని, నువ్వోమారు ఇలా రావోయ్!' అని ఎదురుకేక వేశాడు. అంతలోనే అద్దంలో ముఖం చూసుకుని, క్రాపు దిద్దుకున్నాడు.

'ఏమిటో! అంత అర్జంటు?' సురేఖ కొంగుకు చెయ్యి ఒత్తుకుంటూ బొడ్డున దోపిన కుచ్చిళ్లు రెండో చేత్తో జారవిడుచుకుంటూ వచ్చింది.

'మనం సాయంకాలం బయటకు పోదాం! సిద్ధంగా వుండు' గడియారం టంగున తొమ్మిదిన్నర కొట్టడంతో, వులిక్కిపడి గుమ్మం అవతలకు వచ్చేశాడు రావు.

'బయటకా?' అని ఆశ్చరపడి అంతలో అర్థం చేసుకుని 'నిజంగానా?' అన్నది సురేఖ.

'ఆఁ ఆఁ నిజంగానే... బయటకు వెళ్తాం...!' కేకవేస్తూ వెళ్లిపోయాడు రావు.

'ఈయనదంతా మరీ విచిత్రమమ్మా!' అనుకుని భుజాలు విరుచుకుని, వంట ఇంట్లోకి వెళ్లిపోయింది సురేఖ. అంతలో ఏమో జ్ఞాపకం వచ్చినట్టుంది. ఏం లేదు. ఆయన బైటికెళ్దాం అని చెప్పిన మాటే అది. బాగానే వుంది వరస. సినిమాకండి అంటే మా అక్కయ్యతో పో అనీ, దరిమిలా పక్కింటి సుభద్రమ్మగారితో పో. అని అనే మనిషిలో ఒక్కసారిగా ఇంత చైతన్యమా?-అది చైతన్యమే!

రావుకి ఒక అక్క వుంది. ఆవిడ మొన్నమొన్నటి దాకా తమ్ముడి సంసారం చక్కదిద్దుతూ, సురేఖకి వంట పాఠాలు నేర్పుతూ, ఇక్కడే వుండేది. సినిమా అంటే చాలు ఆవిడ వున్నన్ని రోజులూ, డబ్బులిస్తా అక్కయ్యతో వెళ్లు అనేవాడు భర్త. 'డబ్బులట! వెధవ డబ్బులు! ఎవరిక్కావాలి?' అని విసుక్కునేది సురేఖ.

'అయ్యో! అదేమిటి పిల్లా... ఎంత యిదైనా మొగుడిని వెధవ అంటావా?' అని నోరు నొక్కుకునేది ఆవిడ.

'కాదులెండి... మిమ్మల్నే విధవంటా!' అనుకునేది మనసులో సురేఖ.

ఇవాళ అదంతా జ్ఞాపకం తెచ్చుకుంటూ గబగబా భోంచేస్తున్నది సురేఖ.

'కొంపదీసి మొన్న ఈయన మద్రాసు నగరం వెళ్లారు. అక్కడో, ఆ మధ్య హైద్రాబాద్ వెళ్లింతర్వాత ఈ కోర్కె కలిగి వుంటుంది' అనుకుంది సురేఖ.

చదువుకున్న పిల్ల గనక ఇట్టే గ్రహించింది సురేఖ.

నిజం కూడా అంతే. రావు ఆ మధ్య హైద్రాబాద్ వెళ్లి అక్కడి ఓ సాయంకాలం చూసి, నాలుగు వారాలు తిరగక మునుపే అక్కణ్నించి వచ్చి, మద్రాస్ వెళ్లి రావడం సంభవించింది. అదే అతనిలోని ఈ చైతన్యం అనండి. విప్లవం అనుకోండి; సదరు కోర్కెకి కారణం!

రావు ఆఫీసుకి వెళ్లి తన సీట్లో కూచున్నాడేగానీ, మనసు పని మీదికి పోక, పరిపరివిధాల పోసాగింది. ఆ మధ్య హైద్రాబాద్ వెళ్లినప్పుడు ముందు ఆఫీసువాళ్లను తిట్టుకుంటూ వెళ్లినా, ఆనక ఎంత బాగుందని?

000

సాయంకాలం హైదరాబాద్ నగరానికి ఆటవిడుపులాగ వుంది. పంజాబీ, హిందూస్తానీ, మరాఠీ, గుజరాతీ పడుచులూ, బురఖాల్లో ముస్లిం అమ్మాయిలతో... టాంక్ బండ్ కళకళలాడే వేళ, పబ్లిక్ గార్డెన్స్ మనోహరంగా వున్నవేళ; ఇప్పుడు నాతో సురేఖ ఉంటేనా?' అనుకున్నాడు రావు. పచ్చనిచాయతో నిండైన పడుచుపిల్లలూ, తరుణజంటలూ; అటూ ఇటూ సందడిగా తిరిగేస్తోవుంటే రావుకి వృథా పోతున్నట్లు అనిపించింది. టాంక్ బండ్ మీదకి తన మిత్రుడు తీసుకెళ్లినప్పుడు; అక్కడ రావు గమ్మత్తయిన దృశ్యం చూచాడు. ఒక బొద్దుపాటి వయసు మళ్లిన సుందరి రెండు జడలు, పరికిణీ, నైలాను ఓణీ వేసుకున్నది. ఆమె భర్త కాబోలు, ఒక బక్క పల్చని వ్యక్తి, మరో నలుగురు, సుర్వా

షేర్వానీ అమ్మాయిలూ కలిసి, మిర్చీలు, బజ్జీబండి మీద మిర్చీలు... పానీపూరీ హాయిగా తినేస్తున్నారు.

'ఓహో! టాంక్ బండ్ పిక్‌నిక్ వచ్చారు కాబోలు! హైదరాబాద్ వాళ్లకి సముద్రం లేదు కాబట్టి ఇదే సాగరతీరం కాబోలు' అనుకున్నాడు. వాళ్లకేసి ఇలా గుచ్చిచూశాడు రావు. 'అయ్యో! ఒక్కసారైనా చదువుకున్న పిల్ల సురేఖను పిక్‌నిక్‌కైనా తీసుకు వెళ్లలేదు' అనుకున్నాడు కూడా.

ఐతే, ఆ 'జంటలు' రావుని కొంచెం కూడా ఖాతరు చెయ్యలేదు.

రావు నవ్వాడు. అంతలో దిగులుపడ్డాడు. రావు మిత్రుడు 'రా పోదాం' అంటూ బస్సెక్కించి మరీ లాక్కుని పోయాడు.

అఫీసులో ఫైల్స్ చూస్తున్నా.... పబ్లిక్ గార్డన్‌లోని రంగు దీపాలు, నీటిచిమ్మటాలు జ్ఞాపకం వచ్చాయి రావుకి. అంతలో హెడ్ క్లార్కు వచ్చి రెండు క్షణాలు బల్ల దగ్గర గప్‌చిప్‌గా నుంచొని 'ఏమోయ్! లాటరీ కట్టావా?' అన్నాడు.

ఉలిక్కిపడి 'అబ్బే! అబ్బే!' అన్నాడు ఫైలు తిరగేసి కంగారుగా తెరుస్తూ రావు.

'ఆహాఁ! అది వస్తే ఏయే ఖర్చులు ఎలా పెడదామా? అని పథకాలు వేస్తున్నావు కాబోలునని!' నవ్వాడు హెడ్ క్లార్కు. అది పళ్లు కొర్కుతున్నట్లే కనిపించింది రావుకి.

ఐతే ఆలోచనలు రాకుండా మానవు. కోర్కెలు ఊహల నాసరాగా తీసుకుంటే అవి ఆలోచనల క్రింద తర్జుమా ఐపోతాయట-రావుకి ఓ మిత్రుడు చెప్పాడు. అసలు ఆ మిత్రుడు మద్రాసులో మరి నాలుగు రోజుల పాటు ఎక్కువ వుంచేసి, ఆఫీసువాళ్ల చేత చీవాట్లు కూడా తెప్పించాడు.

మద్రాసులో పాండీ బజార్‌లో సినీ స్టార్లు ఉంటారనుకుంటే లేరు సరిగదా, అన్నీ కొత్త మొహాలే! తనది కూడా ఓ కొత్త మొహమే నసుకున్నాడు రావు.

'ఛాఛా! చెన్నయ్ బొత్తిగా బాగులేదు' అనేశాడు కూడా మిత్రుడితో! మిత్రుడు రావు వీపు తట్టాడు. దాని అర్థం తెలిసింది కాదుగాని రావు, తనూ నవ్వి.... 'మా ఆంటీ చెప్పిందోయ్! ఇక్కడ సినిమా తారలు అటూ ఇటూ పచార్లు చేస్తారటగా?' అన్నాడు. 'ఆ రోజులు పోయాయి సినిమా పరిశ్రమ హైదరాబాద్ పోయింది' అన్నాడు.

కాని ఆ మర్నాడే ఆదివారం అవడంతో, మెరీనా బీచ్‌కి తీసుకు వెళ్లాడు మిత్రుడు, 'ఓహో! ఇవాళేమైనా తిరణాలా?' అని అడిగాడు జనసందోహపు సందడిని చూసి రావు.

'భేష్! బాగుందిరా! ఆదివారమోయ్! ఆదివారం!! అంతకంటే మంచి పండుగ ఏమిటీ మద్రాసుకీ?' అన్నాడు మిత్రుడు మూర్తి.

ఎర్రని, పచ్చని, నీలం రంగుల రకరకాల దుస్తులలో, కార్లల్లో బస్సుల్లో జనం దిగబడుతూ వుంటే, ఎర్రని పూల కృష్ణతామర మొక్కలన్నీ తెల్లబోయి వెలవెలబోయాయి. సముద్రం దూరంగా 'విరుచుకుపడ్డ నగరాన్ని' చూసి వెనక్కి తగ్గిట్లుగా వుంది, దగ్గరగా కార్లు, మనుషులు, బస్సులు సింధీ సుందరాంగనలు పచ్చగా, చక్కగా రంగురంగుల సిల్కు దుస్తుల్లో నవ్వుతూ కేరుతూ 'నడిచే ఫలహారశాల'ల మీదకు ఎగబడుతూ వుంటే, 'వీళ్లకి తిండి గొడవ తప్ప మరోటిపట్టదా' అనుకున్నాడు రావు. అంతలో ఓ చిన్నది నైలాను వోణీ వేసుకున్నది, ఐస్ క్రీమ్ తింటున్నదేమో, ముందుకు ఒంగి మీదపడకుండా ఓ పెద్ద ఫీట్ చేస్తున్నట్లు తింటున్నది. ఈ లోగా ఆ పిల్ల 'పయ్యెద' కాసేపు గగనవిహారం చేస్తానని అలా అలా బయలుదేరిపోయింది! అదికూడా గమనించలేదు ఆ సింధీ చిన్నది. ఆ వింతనలా చూస్తున్న రావునంతలో మరో కన్నె పడుచు ఛీ కొట్టేసింది. ఉలిక్కిపడి సగమైపోయిన రావుని గమనించనైనా గమనించకుండా వెళ్లిపోయింది కూడా!

ఓ సుందరాంగి, ఓ సూటు సుందరుడూ స్కూటర్ మీద జర్రున వచ్చి పుట్‌పాత్ దగ్గర దిగి, ఛాట్ బండీలో కొనుక్కొని తింటు న్నారు. తన సురేఖ కూడా అలా ఒకవేళ తను స్కూటర్ కొంటే ఇలా గ వాటేసుకుంటుందా? అసలు మొదట తను ఆ సూటు సుందరుడిలా వుండాలి కదా అనుకున్నాడు. అయినా సురేఖ అలా కూచోగలదా?' అన్న ప్రశ్న.

'కాస్త నాజుకుగా, ఒయ్యారంగా, ఇస్త్రీగా కనిపించిన పిల్లనల్లా స్టూడెంటనుకునేవాడినోయ్ కొత్తల్లో-కాని ఆనక తెలిసింది వర్కింగ్. గాల్స్' అని అన్నాడు మూర్తి...

'అయ్యా రావూజీ... మీరేమో ఈ డ్రాఫ్టులో టాంక్ బండ్ అని రాశారు. నేను టైపు కొట్టాకా ఆయన నన్ను కొట్టినంత చేస్తారు' అంటున్నాడు టైపిస్టు సుబ్బారావు తను తప్పు రాసిన డ్రాఫ్టు తెచ్చి.

'ఛా!' అని స్వగతం అనుకుని ఊహాగానం లోంచి ఇవతలపడి 'సారీ! అంటూ ఉస్సురన్నాడు రావు.

'అదేమిటండీ! సురేఖవి అసలే అందమైన కళ్లేమో!' మరీ పెద్దవిచేసుకుని రావుని చూసింది. అనిపించింది.

అదే జ్ఞాపకం వచ్చి వెంటనే లేచి నిల్చున్నాడు.

సురేఖ సిద్ధంగా వుండివుంటుంది. ఇక బయటకు పోవాలి అనుకున్నాడు.

కానీ 'మేనేజరుగారు పిలుస్తున్నారు!' అన్నాడు రంగయ్య వచ్చి.

'కొంపదీసి మళ్లీ తప్పు రాయలేదు. కదా?' అనుకుటూ వెళ్లాడు.

**000**

'అమ్మో! ఏమిండీ అలా బాదేస్తున్నారు? వస్తున్నా' అని తలుపు తీసింది సురేఖ.

రావుని భార్యని చూడ్డంతోనే ఒళ్లు మండిపోయింది. కుచ్చిళ్లు పైకి తీసి బొడ్లో దోపుకుంది. చేతులకు ఉంది కాబోలు. ముంగురులు సవరించుకుంది కాబోలు-నుదుట కుంకుమబొట్టు ప్రక్కనే పిండిచార, చెమట కారుతోంది మొహంలో. తలరేగి వుంది...

'కూలిచేసి వచ్చావా? తట్టలు మోశావా?'

'అయ్యో-సాధింపానీ? మీ వారి పొలాలా? మా వారి లోగిళ్లా? ఎక్కడ చేయను కూలి? రండి లోపలికి. బజ్జీలు వొండేను!' అని

సముద్రం దూరంగా 'విరుచుకు పడ్డ నగరాన్ని' చూసి వెనక్కి తగ్గిట్లుగా వుంది. దగ్గరగా కార్లు, మనుషులు, బస్సులు సింధీ సుందరాంగనలు పచ్చగా, చక్కగా రంగురంగుల సిల్కు దుస్తుల్లో నవ్వుతూ కేరుతూ 'నడిచే ఫలహారశాల'ల మీదకు ఎగబడుతూ వుంటే, 'వీళ్లకి తిండి గొడవ తప్ప మరోటిప ట్టదా' అనుకున్నాడు రావు. అంతలో ఓ చిన్నది నైలాను వోణీ వేసుకున్నది, ఐస్ క్రీమ్ తింటున్నదేమో, ముందుకు ఒంగి మీదపడకుండా ఓ పెద్ద ఫీట్ చేస్తున్నట్లు తింటున్నది. ఈ లోగా ఆ పిల్ల 'పయ్యెద' కాసేపు గగనవిహారం చేస్తానని అలా అలా బయలుదేరిపోయింది!

నవ్వుతూ దారితీసింది.

'ఛీ కర్మ! ఆఫీసులాగే వుంది ఆలి కూడాను. బైటకు పోదామని ఏడిస్తినిగా?'

'అరెరె! రండి రండి. క్షణంలో వచ్చేస్తాను.' నాలిక్కరుచుకుని వంట ఇంట్లోకి పరిగెత్తి బజ్జీలు ప్లేటులో తెచ్చి ఇస్తూ, 'ముందవి తినండి. నేనిక్కడున్నట్టు తయారై వస్తాను' అన్నది.

కుర్చీ బర్రున ఈడ్చి కూర్చొని 'త్వరగా దయచేయ్' అన్నాడు.

బజ్జీలు చాలా బాగా చేస్తుంది సురేఖ. తాపీగా నాలుగు తిని 'అయిందా?' అని కేకవేశాడు లోపలికి.

'ఇదుగో వచ్చే'నని అట్నుంచి కేక.

'అక్కయ్య గనక ఉంటేనా? ఇలా బైటకు పోవడం... బజార్లో తిరగడం... నైజాన్నా అనేది' అనుకున్నాడు రావు. అక్కయ్య ఈ మధ్యనే 'నీ పెళ్లాం నాయకురాలైందిరా! ఫర్వాలేదు' అని సురేఖకో ఖితాబు కూడా ఇచ్చి ఊరెళ్లింది.

ఆ పిల్ల పెళ్లినాటి కంచిపట్టు చీరె కట్టుకుంది. అల్మారాలో దాచి వున్న గాజులు కూడా తీసి చేతులకు వేసేసుకుంది. మెడవార పౌడరు కనిపిస్తూనే వుంది. మొహాన చిరుచెమటలకి అప్పుడే పౌడరు కారుతోంది!

'ఏమిటా వేషం! అప్పాయమ్మలాగ! మంచి చీరెలేవీ లేవు కాబోలు!' విసురుగా దుఃఖం దిగమింగుకుని, ఆఖరి బజ్జీ తిననా? మాననా? అని సందేహంలో పడ్డట్టు ఒక్క క్షణం ఆలోచించి, ప్లేటులో పడేసి పెరట్లోకి వెళ్లిపోయాడు.

'ఛీ! జార్జెట్ చీరెలు కట్టుకుని బైటకు వెడితే వొంటినుండవు' అని జవాబిచ్చింది సురేఖ. పయటంచు నడుం మీదకంటా తీసుకుని జాకెట్టుకీ, చీరకట్టుకీ మధ్య మిగిలిన జాగాను కప్పుకుంటూ.

'కర్మ అనుకో! అసలు నువ్వూ ఎమ్మే ఫైనలు తగలేశావంటే ఎవర్రైనా నమ్ముతారా?' అన్నాడు చొక్కా ప్యాంటులో ఆదరాబాదరా దోపుకుంటూ.

'అసలింతకీ బజార్లోకి కదా వెళ్లాలి? అంత హడావుడి ఎందుకూ? సినిమాకి కాదుగా?' చేతిరుమాలు అందిస్తూ అసలు సమస్యను ఎదుట పెట్టింది అమాయకంగా సురేఖ.

'ఔను సుమా! ఇది మన వూరు కదూ? ఎక్కడికి వెళతాం? అరెరె విశాఖపట్నంలోలాగా ఒక సముద్రమైనా లేదు ఈ వూరికి. పోనీ పార్కు? ఉహూ...అది పార్కే కాదు. వెళ్లలేం అక్కడికి' దువ్వెన జేబులో పెట్టుకుని, పాకెట్ రుమాలుతో తలదువ్వ కోబోయాడు రావు.

'అయ్యో! అంత యిదెందుకండీ... అలా బజారుకెళ్లి ఎన్నాళ్లనుంచో అనుకుంటున్న... ఇడ్లీపాత్ర.... రైస్ కుక్కర్ కొనుక్కొచ్చుకుందాం' అన్నది సురేఖ ఒకటో ఎక్కంతో చేయాల్సిన లెక్కను చేసినంత సులువుగా.

'నాన్సెన్సు... అదా వీకెండ్?' అని ఉగ్రుడై పోయాడు.

'మరేది? ఈ వూళ్లో సముద్రతీరాలు లేవుగదా? సినిమాకి వెళదామా?' అడిగింది అసలు కోర్కెను ఎట్టకేలకు బయటపెట్టి సురేఖ.

'అంతే మరి-నీ మొహానికి తగ్గట్టే వూరూను.'

మునిసిపల్ ఛైర్మను కూడా కాదు సురేఖ నాన్న. బడిపంతులు. ఐనా భార్యని తప్ప ఎవర్ని తిడితే ఎవరూరుకుంటారు?

'ముందు పద' అన్నాడు గడియారం ఆరుకొట్టేసిన పావుగంటకి బయటపడ్డారు ఆ జంట.

కొత్తగా వుంది సురేఖకు. పెళ్లయి ఏడాది అయినా, భర్తతో కలసి ఎప్పుడూ బజారులోకి రాలేదు. చెప్పులు కొత్తవి-కాస్త ఎత్తు మడమలున్నాయి కూడాను-దానికి తోడు రోడ్డుమీద పోయే ప్రతీవాడు తననే చూస్తున్నాడేమోనన్న భీతీ, కోపం, ఉక్రోషం! భర్త-ఒక్కటే, పదిగజాల ముందుకో-లేదూ . గజం ఎడంగానో అయిపోతూ రావడం... కళ్లతోనే బోలెడు విసుగుదల చూపడం ఆ పిల్లకు మరీ మరీ చిరాకు కలిగించింది.

'ఛీ! జార్జెట్ చీరెలు కట్టుకుని బైటకు వెడితే వొంటినుండవు' అని జవాబిచ్చింది సురేఖ. పయటంచు నడుం మీదకంటా తీసుకుని జాకెట్టుకీ, చీరకట్టుకీ మధ్య మిగిలిన జాగాను కప్పుకుంటూ. 'కర్మ అనుకో! అసలు నువ్వూ ఎమ్మే ఫైనలు తగలేశావంటే ఎవర్రైనా నమ్ముతారా?' అన్నాడు చొక్కా ప్యాంటులో ఆదరాబాదరా దోపుకుంటూ.

'అబ్బ! అన్ని గాజులు వేసుకోపోతే ఏం?' అన్నాడొకసారి భార్యను చూసి.

ఒక పక్క చెప్పులు కుక్క పీకినట్లు పీకుతూ వుంటే 'ఇదేమిటమ్మా...ఈయన బాధ' అనుకుంది.

'అసలు తన పిచ్చిగాని, తన భార్య నైలా నుసుందరిలా ఎలా అవుతుందీ?' లోపల లోపల భార్య వేషం, నడక నచ్చక బాధపడు తున్నాడు రావు.

అసలు ఉద్దేశంలో మొదటినించీ సురేఖవి హంసనడకలు-అసలా పిల్లే అందాలభామ. ఏ 'స్టారూ' పనికిరాదని మురిసి పెళ్లాడాడు కూడా. కాని ఇప్పుడో 'అబ్బే, ఆఖరికి చీర కట్టుకోడం కూడా రాని, నడవడం చేతగాని వుత్త ఇదిగా' తోచింది.

ఈలోగా, సురేఖ అట్నుంచి చిన్న పర్వతంలా వస్తోన్న మునిసిపాలిటీ గజేంద్రుణ్ని... అనగా వరాహమును ఎలా తప్పుకోడమా? అని చూస్తున్నది. నిర్దాక్షిణ్యంగా ఆ పంది సురేఖను వదిలి, రావు ప్యాంటును రాసుకుంటూ మరీ పోయింది!

'ఛీ! నీతో బయటకు రావాలనుకోడమే నా బుద్ధి తక్కువ!' పెళ్లాన్ని చూసి ఏడుపు మొహం పెట్టాడు.

ఇంతలో అట్నుంచి 'టాంకర్'లాగా రానేవచ్చింది లారీ. పోయిన వారం కాబోలు కురిసింది వాన. అయినా రోడ్లో అసలు సిసలు జలాశయాలలాగ నీళ్లకుంటలున్నాయి. లారీ చక్రం ఛళ్లున నీళ్లు త్రుళ్లించి మరీ వెళ్లిపోయింది.

'అయ్యో! మీ ప్యాంటు!' అన్నది సురేఖ అవతలి వేపుగా తప్పుకుని. ప్యాంట్ కాదు. రావు చొక్కా మీద కూడా బురద పడింది డిజైన్‌లాగా!

'ఆటో!' అన్నాడు గట్టిగా రావు.

'ఎందుకండీ?' అడిగింది సురేఖ.

'చావడానికి!'

'ఊర్వశిలో 'కొత్తపెళ్లాం సిన్మా బావుందట!' యిప్పుడే మాటనీ వదిలినాడు రండి' అన్నాడు.

అదీ వెధవ బ్రతుకు. అనుకున్నాడు.

ఆ విధంగా వీకెండ్ సినిమాగా మారడంతో ఆటోవాడు, ''ఇద్దరు కదా, ఇరవై'' అన్నాడు.

''మీటర్ వెయ్యి!'' అన్నాడు రావు.

'మీటర్ పాడయింది!' అని వాడు తిప్పేసుకుంటున్నాడు ఆటో.

'స రే! ఇదీ ఈ వెధవవూరు వ్యవహారం' అనుకుని ఆటో ఎక్కాడు.

'అసలు ముందే ఆ సినిమాకే పోతే, ఈ బాధ వుండునా?' అన్నది సురేఖ ఆటోలో కూచున్నాక స్తిమితంగా రోడ్లకేసి వింతగా, ఆసక్తిగా చూస్తూ.

'ఆహా! వెధవని ! నాకు ఈ వూరు, ఈ పెళ్లాం జ్ఞాపకం

వుంటేగా...! ఎక్కడో మరో సముద్రంలో ఏడిశానుగా' అంటూ ఊరి మీద కోపం ఆలిపై చూపాడు రావు.

[illegible]కి తప్పు మరో టిక్కెట్టు లేదు. సరేనని దుఃఖపడుతూనే [illegible] యాభయి తీసి యిచ్చాడు రావు. చీకట్లో తడుముకుంటూ [illegible]ల్లోకి వెళ్లేసరికి, 'రోజుకు ఒక సబ్బు వాడి చర్మసౌందర్యం కాపాడుకుంటున్న సినీతార 'రీలు' అయిపోతోంది.

ఎట్టకేలకు ఒక వరసలో వున్న పెద్ద మనిషిని అటు జరగమని బ్రతిమాలి, రెండు వరస సీట్లు సంపాదించగలిగాడు రావు.

కూర్చున్నాడు కానీ ముళ్ల మీద కూచున్నట్లే వుంది. 'వెధవదీ బాల్కనీ అంటారు. రెండేసి కుర్చీలకు ఒకటే చెయ్యి' హైదరాబాద్‌లో లాగా పార్కులు లేవు! విజయవాడలోలాగా... కృష్ణానదీ లేదు! అని విసుకున్నాడు. తన చెయ్యీ, భార్య చేయీ ఒక కుర్చీ చెయ్యి మీద ఒక దాని మీద ఒకటి పెట్టుకుంటే బాగానే ఉందిగాని... సురేఖ అవతలి కుర్చీలో బొద్దుపాటి మీసాల వ్యక్తి కూచుని, తన మోచేయి దబాయించి మరీ సురేఖ ఒళ్లో ఉందా అన్నంత 'యిది'గా పెట్టుకున్నాడు. అదీ రావు బాధ! సురేఖ సినిమా చూసేస్తోంది.

'సరే! మన సినిమా హాల్సు ఇంతే' అని సద్దుకుని సినిమా చూద్దామనుకున్నాడు రావు.

'ఏమండీ!' అంది సురేఖ

ఆ పిల్ల ముందు సీట్లో కూర్చున్న వ్యక్తి ఆరడుగులుండి వుండాలి! అందుకని సురేఖకి సినిమా సగం మాత్రం కనిపిస్తోంది.

సీటు మారి, సురేఖను ఇటు రమ్మని, దబాయించి తన మోచెయ్యి మీసాల వ్యక్తి వొళ్లో అన్నంత యిదిగా పెట్టుక్కూచున్నాడు రావు.

రెండు సీనులేనా కాలేదు, విలన్ హీరోయిన్‌ని కొడుతున్నాడు తెర మీద. ఇంతలో సురేఖ 'ఏమండీ!' అంది చెవి దగ్గరగా. 'వీడెవడో సారా తాగివచ్చినట్టున్నాడు! కంపు! వాసన!. నాకు డోకు వస్తోంది బాబూ!' అంది గుసగుసగా.

'భగవంతుడా!' అనుకున్నాడు రావు. దేవుణ్ణి ఎన్నడూ అంత భక్తితో తల్చుకోలేదతగాడు!

మళ్లీ మరో సీనులో దొంగలు హీరోయిన్‌ను మంచంతో సహా ఎత్తుకుపోతూ వుంటే 'ఏవండీ!' అంది సురేఖ. ఈ సారి ఆందోళన, భయం కూడా వ్యక్తమయ్యాయి ఆ పిల్ల కంఠంలో.

'ఎందుకేం? ముందు సినిమా చూడు' విసుకున్నాడు.

పెళ్లి అయ్యాక తొలిసారిగా భార్యతో బైటకు వచ్చిన కొత్త ఆలు మగల సాయంకాలం, సంతోషం, సరదా తెలీలేవు.

'అది కాదండీ! దొడ్డి తలుపు గడియ వెయ్యలేదండీ' సురేఖ చెప్పేసింది.

'ఏమిటీ?' రావు గుండెలు విలన్ పారిపోతున్న జీపు వేగంతో కొట్టుకున్నాయి.

'అయ్యో! ఆఫీసు సొమ్ము డ్రాయర్లో వుంది. పద!' వెంటనే తేలు కుట్టినట్టు లేచాడు, వెనుకనే సురేఖ బయలుదేరింది. ఆ పిల్లకి చాలా భయంగా ఉంది. భర్త తిడతాడని కాదు. కొంప దోచుకుపోయారేమోనని... అసలే దొంగల హడావుడీ!

నలుగురి కాళ్లు, ఇద్దరి వ్రేళ్లూ తొక్కేసి యివతల పడేసరికి-హోరున వాన! కన్నీళ్ల పర్యంతం అయింది దంపతులకి.

'అరవై రూపాయలు' అడిగాడు ఆటోవాలా...

ఆటోలో కూచున్నా, వాన నిర్దాక్షిణ్యంగా నాలుగు వేపుల నుంచీ మొత్తేసింది.

నీళ్లోడుతూ, గుమ్మంలో ఆందోళనతో దిగేసరికి చూరు క్రింద గుమ్మంలో మూట పట్టుకుని ఎవరో కూచున్నట్టుంది.

'ఒరి మీ ఇల్లు బంగారంగాను-ఎక్కడికి పోయారర్రా?' అన్నది రావునీ, సురేఖనీ చూస్తూనే అక్కయ్య.

'నువ్వేలా తగలడ్డావ్?' అనబోయి అంతలో తమాయించుకుని, 'ఎప్పుడు వచ్చావ్ అక్కా' అన్నాడు.

'అరగంట అయింది...పాసింజర్‌లో' అంది ఆవిడ!

'ఆ వచ్చేదేదో మధ్యాహ్నం వస్తే దండగ లేకపోను' అన్నాడు తనలో లోపల, తలుపు త్వరగా తీస్తూనే. సురేఖ లోపలికి పరుగెత్తింది. పెరటి తలుపు తీసే వుంది!!

దొంగలు రాలేదు గానీ, పిల్లి వంట యింట్లో అన్నీ తిరగదోసి తాటాహూటం చేసి వెచ్చగా గ్యాస్ సిలిండర్ పక్క పడుకున్నదల్లా లేచి, 'మియాఁవ్' అన్నది సురేఖను చూసి. 'సిన్మా బాగుందా పిల్లా?' అని భోగట్టా చేసినట్లు.

'ఆఁ నా మొహం లాగుంది! ఛీ, ముండా!' అని ఒక్కటి వడ్డించింది గరిటతో దాన్నెత్తిన.

'అయ్యో! నీ అబసంతితనం కూలా! పిల్లి వస్తుందని తెలియొద్దే నీకు? కాపురానికొచ్చి ఏడాదైంది...?' అన్నది దవడలు నొక్కుకుంటూ... గయ్యాళి అక్కయ్య.

'సరే...! ఒరే తమ్ముడూ! నే మడిగట్టుకు వండేస్తాగానీ యీలోగా ఆ తడిగుడ్డలిప్పి అవతల పారేసి బట్టలు మార్చుకుని రారా...' కేకేసింది రావుని.

'వద్దురా బాబూ వద్దు! పెళ్లాంతో వీకెండ్సు... సిన్మాలు మనలాంటి వాళ్లకి కుదరవ్!' అని లోలోపల అనుకుంటూ, లెంపలు వేసుకున్నాడు రావు. తడి బట్టలతోనే గబగబా గదిలోకి వెళ్లి, టేబుల్ డ్రాయర్ లాగి కదలకుండా వున్న ఆఫీసు డబ్బులు వున్న కవరు చూసుకుని, 'థాంక్ గాడ్!' అని స్తిమితంగా కుర్చీలో కూలబడ్డాడు.

